ప్రశాంతంగా పోలింగ్

క్లుప్తంగా

గెలుపుపై అభ్యర్థుల ధీమా

అశ్వారావుపేట: గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో గెలుపుపై పార్టీల అభ్యర్థులు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అశ్వారావుపేట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నియోజకవర్గ ప్రజలు తనకే ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపిస్తారని, 3 వతారీకు తేలనున్న ఎన్నికల ఫలితాలలో ఇది తేటతెల్లం అవుతుందని బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మెజార్టీతో గెలుస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళి, ఓటర్ల స్పందన బీఆర్ఎస్ పార్టీకే ఉందని, అధిక మెజార్టీతో తను గెలుస్తున్నట్లు చెప్పారు.

తెల్లం వెంకట్రావు..

భద్రాచలం: భద్రాచలానికి జరిగిన అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కే సంపూర్ణ మద్దతు ప్రకటించారని ఆ పార్టీ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని మండాలాల్లో మా అధిక్యం కనిపించిందని, తొలిసారిగా ఇక్కడ బీఆర్ఎస్ గెలవనుందని ధీమా వ్యక్తం చేశారు.

పొదెం వీరయ్య..

భద్రాద్రి నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రజలు మరో సారి అధికారం కాంగ్రెస్‌కు ఇస్తున్నారని ఆ పార్టీ భద్రాచలం అభ్యర్థి పొదెం వీరయ్య ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఈ సారి కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. రాష్ట్రంలో అధికారం సాధించడం తథ్యంమని పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు



ఈవీఎంలను అప్పగిస్తున్న ఉద్యోగులు

మణుగూరుటౌన్: అసెంబ్లీ ఎన్నికల చివరి ఘట్టమైన ఓటింగ్ పూర్తవడంతో ఈవీఎంలు, వీవీప్యాట్‌లు మణుగూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు పోలీసు బందోబస్తు నడుమ గురువారం సాయంత్రం 7 గంటల వరకూ తరలించారు. 4గంటలకే పోలింగ్ పూర్తయినప్పటికీ కొందరు క్యూలోనే ఉండటంతో కొన్ని కేంద్రాల్లో ఓటింగ్ 6 గంటలు దాటినా జరిగింది. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలు, ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, వీవీప్యాట్‌లు రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. శుక్రవారం ఉదయం పోలీసు బందోబస్తు నడుమ పాల్వంచలోని లెక్కింపు కేంద్రంకు తరలించనున్నారు.

గణపతి హోమం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అశోక్ నగర్ కాలనీలోని శ్రీరామభక్తాంజనేయ స్వామివారి ఆలయంలో గురువారం గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. జకల జనులు సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో అర్చకులు ఈ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: ఓటు హక్కు వినియోగించుకున్న పినపాక రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ దంపతులు



చంద్రుగొండ: ఓటు వేసిన శతాధిక వృద్ధుడు (125) ఇబ్రాహీం



దుమ్ముగూడెం: స్వగ్రామంలో ఓటు వేసిన భద్రాచలం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య



అన్నపురెడ్డిపల్లి: తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు



ములకలపల్లి: పూసుగూడంలో ఎన్నికల కేంద్రం వెలుపల వైద్యశిబిరం

బూర్గంపాడు: మండలంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మోరంపల్లిబంజరలోని 234 పోలింగ్ కేంద్రం, లక్ష్మీపురంలోని 222 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కొద్దిసేపు ఓటింగ్ నిలిచిపోయింది.అధికారులు సవరించి ప్రారంభించారు. అక్కడక్కడ పోలింగ్ కేంద్రాల బయట రాజకీయపార్టీల నాయకుల మధ్య చిన్నపాటి తగవులు చోటుచేసుకున్నాయి.

అన్నపురెడ్డిపల్లి: మండల వ్యాప్తంగా 20 పోలింగ్ బూతుల్లో పోలింగ్ జరగగా.. పోలింగ్ సరళిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారె ఆదినారాయణ, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూతులను జిల్లా సాధారణ అబ్జర్వర్ గణేష్ పరిశీలించారు.

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం తగ్గింది. 2018లో భద్రాచలం నియోజకవర్గంలో 80.41 శాతం పోలింగ్ నమోదవగా.. ఈ సారి 67 శాతమే రికార్డ్ అయింది. ప్రజలతోపాటు పలు పార్టీల అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. దివ్యాంగులు, వృద్ధులకు ముందస్తుగా అవకాశం కల్పించినప్పటికీ కొన్ని చోట్ల పడిగాపులు కాశారు. నన్నపనేని మోహన్ పాఠశాల వద్ద బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్‌కు చెందిన మహిళా నాయకురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రుగొండ: మండలంలో మొత్తం 27 కేంద్రాలుండగా అందులో బాల్యతండా, రావికంపాడు గ్రామాల్లోని కేంద్రాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి. దీంతో ఓటర్లు ఆగ్రహించారు. ఎస్సై మాచినేని రవి అక్కడికి చేరుకుని ఓటర్లు సముదాయించారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కారమైనప్పటికీ పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చానాగేశ్వరరావు, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జారె ఆదినారాయణ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు.

దుమ్ముగూడెం: మండలంలోని 40 పోలింగ్ బూత్‌లలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలు సజావుగా సాగాయి. 86.3 శాతంగా పోలింగ్ నమోదైంది. లచ్చిగూడెం పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం మొరాయించడంతో వెంటనే అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను కొనసాగించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మండలంలో ఎన్నికలు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పార్టీల అభ్యర్థులు, అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడులో బారులుదీరిన ఓటర్లు..

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ సతీసమేతంగా గురువారం మణుగూరు జెడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు సైతం అదే బూత్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దమ్మపేట: మండల వ్యాప్తంగా 52 పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి ఘర్షణలూ లేకుండా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. తొలిసారి ఓటు వేసేందుకు వచ్చిన యువత ఉత్సాహంగా కనిపించారు. పార్టీల అభ్యర్థుల పోలింగ్ సరళిని పరిశీలించారు.

ములకలపల్లి: మండలపరిధిలోని 34 బూత్‌లలో సాయంత్రం నాలుగు గంటలు దాటినా, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు భారీగా బారులుతీరారు. దీంతో సాయంత్రం ఆరు గంటల వరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. కమలాపురంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో అత్యధికంగా 94.80 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల పరిశీలకుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పలు బూత్‌లను పరిశీలించారు.

అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలో సాయంత్రం 5.30 గంటలకు 71.8 శాతంగా పోలింగ్ నమోదైంది. అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా 51 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది పోలింగ్ నిర్వహించారు. క్యూలైన్లో గంటల కొద్ది నిలుచొని ఓటు వేశారు. సాయంత్రం 4గంటల తర్వాత కూడా ఓటర్లు బారులు తీరే కనిపించారు.

చర్ల: మండలంలో గురువారం 36 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 2018లో జరిగిన జరిగిన శాసన సభ ఎన్నికల్లో చర్ల మండలంలో 82.03 శాతం నమోదవ్వగా ప్రస్తుతం 83.78 శాతం నమోదైంది.

మణుగూరుటౌన్: మణుగూరులోని 66 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా సాగాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఈవీఎంలు మోరాయించాయి. ఆదర్శనగర్‌లో ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. దీంతో పలు పార్టీల నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగగా, వెంటనే ఆర్ఓ ప్రతీక్ జైన్, అధికారులు సమస్యను పరిష్కరించారు.

అశ్వాపురం: మండలంలో 83.4 శాతం పోలింగ్ నమోదు అయింది. 41 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు సాయంత్రం వరకూ బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కరకగూడెం: పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని చోట్ల ఓటర్లు నిరీక్షించి, నీరసించి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమత్ భట్టుపల్లి పోలింగ్ కేంద్రంలో ప్రభుత్వ విప్,బీఆర్ఎస్ పినపాక ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఏజెన్సీ మండలం కావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



మణుగూరురూరల్: ఓటు హక్కును వినియోగించుకుంటున్న డీఎస్పీ రాఘవేంద్రరావు



భద్రాచలం: ఓటింగ్ అనంతరం కుమారుడు, కుమార్తెతో బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మ



చంద్రుగొండ: కొత్తగా ఓటుహక్కు వినియోగించుకున్న ఆనందంలో యువకులు



చంద్రుగొండ: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న అబ్జర్వర్ గణేష్



దమ్మపేట: వీల్ చైర్‌లో వస్తున్న వృద్ధురాలు..



అశ్వాపురం: వృద్ధురాలిని ఎత్తుకొని పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకొస్తున్న కుటుంబ సభ్యుడు



కరకగూడెం: అనంతారంలో ఓటు వేయడానికి నిరీక్షిస్తున్న మహిళా ఓటర్లు



దుమ్ముగూడెం: స్వగ్రామం చెరుపల్లిలో ఓటు వేసిన సినీ దర్శక, నిర్మాత విజయ్‌వర్మ



అశ్వారావుపేటరూరల్: చంటి పిల్లలతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు



మణుగూరుటౌన్: వీటీసీ పోలింగ్ కేంద్రం వద్దకు ఈవీఎంలు తీసుకొస్తున్న సిబ్బంది



మణుగూరుటౌన్: పీవీకాలనీలో సింగరేణి స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



బూర్గంపాడు: ఓటుహక్కును వినియోగించుకున్న చిన్న పిల్లల తల్లులు



గుండాల: దివ్యాంగురాలిని కేంద్రానికి తీసుకువెళ్తున్న దృశ్యం



భద్రాచలం: నన్నపనేని మోహన్ ఉన్నత పాఠశాలలో బారులుదీరిన ఓటర్లు



కరకగూడెం: సమయం ముగియడంతో కరకగూడెం పోలింగ్ కేంద్రాన్ని మూసివేస్తున్న సిబ్బంది

ఎలక్షన్ సిత్రాలు..

మల్లెలమడుగులో వాగ్వాదం..



కాంగ్రెస్-బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో జిల్లా పరిషత్ పోలింగ్ కేంద్రం వద్ద గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. వాగ్వాదం ఉద్రిక్తతకు దారి తీయడంతో సీఆర్పీఎఫ్ సిబ్బంది స్వల్పంగా లాఠీచార్జ్ చేశారు. సీఐ రవీందర్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బందోబస్తును పర్యవేక్షించి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. మండలంలో గతంలో జరిగిన గొడవలు, దాడులు జరగకుండా సీఐ రవీందర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

నివాసం ఓ చోట.. ఓటు ఇంకో చోట

అశ్వాపురం: అధికారుల నిర్లక్ష్యంతో ఓ యువతి తన ఓటు హక్కు కోసం గురువారం 18 కిలోమీటర్లు ప్రయాణించి అవస్థలు పడి ఓటు హక్కు వినియోగించుకుంది. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీకి చెందిన భారజల కర్మాగారం ఉద్యోగి కొలిశెట్టి సోమయ్య కూతురు కొలిశెట్టి ప్రణతి(24) తన ఓటు తుమ్మలచెరువు గ్రామపంచాయతీలోని వెంకటాపురం పోలింగ్ కేంద్రంలో నమోదైంది. 2018లో కూడా యువతి ఇదే కేంద్రంలో ఓటు వేయాల్సి వచ్చింది. హక్కు వినియోగించుకుంది. పోలింగ్ కేంద్రం మార్చాలని ఫారం–8 దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో 18 కిలోమీటర్లు ప్రయాణించి వెంకటాపురంలో ఓటు హక్కు వినియోగించుకుంది.

ఓటర్లకు తప్పని ఇక్కట్లు..

భద్రాచలం: ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించటంలో అధికారులు విఫలయ్యారనే ఆరోపనలు వ్యక్తమయ్యాయి. బుధవారం జరిగిన ఎన్నికలలో పాల్గొనేందుకు వచ్చిన ఓటర్లుకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం నుంచి ఓటర్ల స్లిప్‌లు అందలేదు. దీంతో ఓటర్లు తమ ఓటు కార్డుతో పోలింగ్ బూత్‌ల చుట్టు తిరిగారు. వయస్సు పైబడిన వారు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్‌లకు సెల్ ఫోనులను ఈ ఎన్నికలలో అధికారులు అనుమతించలేదు. దీనిపై అవగాహన లేకపోడంతో అనేక మంది పోలింగ్ బూత్‌ల బయటే ఆగిపోవడం కనిపించింది. కొంత మంది తిరిగి ఇండ్లకు వెళ్లి మళ్లీ రావడం సైతం చేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు కుర్చీలను ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఈవీఎంల వద్ద సరైన లైటింగ్ లేదంటూ ఓటర్లు ఓటు హక్కు అనంతరం అధికారులకు ఫిర్యాదు చేశారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా సాగడంతో ఆయా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. మహిళలు, వృద్ధులు పడిన అవస్థలు వర్ణాతీతమే. ఆసుపాక కేంద్రంలో మహిళలు, పురుషులు గంటల కొద్ది ఎండలోనే నిలబడి ఓటు వేయాల్సి వచ్చింది. చాలా కేంద్రాలు దూరంగా ఉండటంతో ఓటర్లు ట్రాక్టర్లు, ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలి రావాల్సి వచ్చింది. ఆయా వాహనాలను చాలా చోట్ల రాజకీయ పార్టీల బాద్యులే ఏర్పాటు చేశారు.



అశ్వారావుపేటరూరల్: వినాయకపురం పోలింగ్ బూత్‌లో మెట్లపై కూర్చున్న వృద్ధులు



భద్రాచలం: కుర్చీలు లేక దిమ్మెపై కూర్చున్న వృద్ధులు

మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలింగ్..





చర్లరూరల్: తిప్పాపురంలో బారులుదీరిన ఓటర్లు, భారీ బందోబస్తు నడుమ ఈవీఎంల తరలింపు..



గుండాల: బందోబస్తులో పోలీసులు..

చర్లరూరల్: మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలింగ్ విజయవంతంగా ముగిసింది. భారీ భద్రత నడుమ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాలైన ఎర్రంపాడు, చెన్నాపురం, బత్తినపల్లి, బట్టిగూడెం, రాళ్లపురం, చలమల, ఉయ్యాలమడుగు, గోరుగొండ, తిప్పాపురం గ్రామాల్లోని ఓటర్లు తిప్పాపురం పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో 79 శాతంగా పోలింగ్ నమోదైంది. ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు మూడు రోజుల క్రితం ఇదే పూసుగుప్ప వద్ద లారీని దగ్ధం చేయడంతో పాటు కలివేరు–పెదమిడిసిలేరు మార్గంలో మందుపాతరను ఏర్పాటు చేసి భయాందోళనలు సృష్టించారు. అయినప్పటికీ జిల్లా పోలీసు యంత్రాంగంతో పాటు, కేంద్ర బలగాలు భారీగా మోహరించడంతో ఎన్నికలు సుజావుగా సాగాయి.


గుండాల: మారుమూల ఏజెన్సీ గ్రామాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు కావడంతో ప్రశాంత వాతావరణం మధ్య ఎన్నికలు జరిగేందుకు పోలీసులు ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. ఓటింగ్‌కు ముందస్తుగానే ఈవీఎం యంత్రాలను పోలింగ్ కేంద్రాలకు తరలించి, ఓటింగ్ అనంతరం పోలీసుల పహరా మధ్య పట్టణాలకు తరలించారు.

తొలిసారి ఓటు వేసిన యువత

18 సంవత్సరాలు నిండి తొలిసారి ఓటు హక్కు పొందిన యువత గురువారం ఓటు వేశారు. ఈ ప్రజాస్వామ్య పండుగలో ఆద్యాంతం ఆనందాన్ని వ్యక్తపరిచారు. తమకు ఎప్పుడు ఓటు హక్కు వస్తుందా అని ఎదురు చూసిన యువత.. ఇప్పుడు ఆ రోజు రానేరావడంతో తబ్బిబ్బిపోయారు. భవిష్యత్‌కు బాటలు వేసేవారికే ఓటు వేసేందుకు మక్కువ చూపారు. వారి ఓటు అనుభవాలను వారి మాటల్లోనే చూద్దాం.

– భద్రాచలంటౌన్/మణుగూరుటౌన్


చాలా ఆనందంగా ఉంది..



రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. నేను తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నాను. హైదరాబాద్‌లో బీటెక్ చదువుతూ.. తొలిసారి వచ్చిన ఓటు హక్కును వృథా చేయొద్దనే భావనతో వచ్చి ఓటు వేశాను. మొదటి సారి ఓటు వేసినందుకు చాలా ఆనందంగా ఉంది.

– జక్కిరెడ్డి శ్రీరామ్ రెడ్డి, భద్రాచలం

ఇన్నాళ్లు వేచి చూశా..



నేను మొదటి సారి ఓటు వేస్తున్నాను. ఎన్నికల సమయంలో మా ఇంట్లో వారు ఓటు వేస్తుంటే నాకు ఎప్పుడు ఓటు వేసే హక్కు వస్తుందాని వేచి చూశా. ఓటు వజ్రాయుధం లాంటిది... యువత దేశానికి వెన్నుముకలాంటి వారు. అటువంటివారు ఓటు హక్కును అందరికన్నా ముందు యువత సద్వినియోగం చేసుకోవాలి.

– బొడ్డు గౌతమ్, భద్రాచలం

తొలిసారి మంచి అనుభూతి..



అభివృద్ధి వైపు అడుగులు వేసే పాలకులను ఎన్నుకునే హక్కును తొలిసారి వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. నా ఓటు యువతకు ఉపాధి కల్పిస్తుందన్న నమ్మకం ఉన్న ప్రభుత్వానికే వేశాను. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా వినియోగించుకుని నా వంతు బాధ్యత నిర్వహించాను.

– మేఘన, మణుగూరు

కరీంనగర్ నుంచి వచ్చా..



నా తొలి ఓటును వినియోగించుకునేందుకు కరీనగర్ నుంచి మణుగూరు వచ్చి ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు వేశాను. తొలి ఓటు ప్రజాసంక్షేమం, ఉపాధి, యువతకు ఉద్యోగాలు, గ్రామాల అభివృద్ధి చేసే నాయకుడి ఎన్నిక కోసం నా బాధ్యతగా నేను నా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

– నితిన్, మణుగూరు

అభివృద్ధి పాలనకే తొలి ఓటు



మాటల గారడీ చేసి ప్రజలకు అభివృద్ధి చేస్తానంటూ హామీలిస్తుంటారు. అయితే హామీలతో సరిపోదు. దాంతోపాటు వాటిని నెరవేర్చే సమర్థ నాయకుడు ఉన్నప్పుడే అది సాధ్యం. అందుకే అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడిని బేరీజు వేసుకుని నా తొలి ఓటు వేశాను.

– ఆశ్లేష, మణుగూరు

ఓటు ఐదేళ్ల భవిష్యత్



మన ఓటు హక్కును వినియోగించుకోకుంటే ఐదేళ్ల భవిష్యత్తును అన్యక్రాంతం చేసిన వాళ్ళం అవుతాం. నేను తొలిసారి తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునందుకు చాలా సంతోషంగా ఉంది. ఓటు వేయని వారు ఏం కోల్పోతున్నారో వారికి తెలవడం లేదు.

– అశ్రిత, భద్రాచలం